ప్రారంభానికి నోచుకోని 'కస్తూర్బా'

● ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు


కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

తరిగొప్పుల: అన్ని సౌకర్యాలతో నిర్మాణం పనులు పూర్తి అయినప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనం. రూ.1.5 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో తరగతి గదులు, డైనింగ్ హాల్, గదులు, ల్యాబ్, మరుగుదొడ్లతో పాటు అన్ని హంగులతో భవన నిర్మాణం పూర్తై నెలలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో ప్రారంభానికి అడుగులు పడడంలేదు. దీంతో మండల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులకు ఇబ్బందులు తప్పడంలేదు. మండలానికి కేజీబీవీ మంజూరు అయినప్పటి నుంచి సొంత భవనం లేకపోవడంతో కొన్ని రోజులు మండలకేంద్రంలో ప్రైవేటు అద్దె భవనంలో కొనసాగింది. అనంతరం నర్మెట మండలంలోని కేజీబీవీ భవనంలోకి విద్యార్థులను క్లబ్ చేశారు. దీంతో నర్మెట, తరిగొప్పుల కేజీబీవీ విద్యార్థులు ఒకేచోట ఉంటుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవన నిర్మాణం పూర్తయినా అందుబాటులోకి తీసుకురాకపోవడంతో విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని పాఠశాల భవనం ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ధర్మభిక్షం

బచ్చన్నపేట: విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్సీ హాస్టల్‌లో మండల నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. చాలా మంది నిరుపేద విద్యార్థులు స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి సకాలంలో అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సకాలంలో స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో చదువుకు నిరుపేద విద్యార్థులు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. దీనిని ప్రభుత్వం గుర్తించి విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న, నాయకులు సాయిరామ్, రాజు, సాగర్, గణేష్, తరుణ్ పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు'

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే ఇప్పటికీ కనిపిస్తాయని, ప్రజలంతా గమనిస్తున్నారని, బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదని పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ చేపూరి చిరంజీవి అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఇటీవల గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నానని, పార్టీ అధిష్టానం అవకాశం ఇస్తే పోటీ చేస్తానన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో, ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ విజయబావుటా ఎగరవేయడం తథ్యమని అన్నారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లో ఇటీవల మృతి చెందిన రేబర్తి పోశయ్య కుటుంబ సభ్యులకు కేబీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండి వెంకట్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు బొమ్మె ఆంజనేయులు, అల్వాల ఎల్లయ్య, మల్లేశం, గండమల్ల ఇస్తారి, యాదగిరి, కిష్టయ్య పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు



చిల్పూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని లింగంపల్లి సమీపంలోని చిన్న పెండ్యాల–తరిగొప్పుల రోడ్డులో కల్వర్టు సమీపంలో రోడ్డు కుంగి కొట్టుకపోగా ప్రమాదకరంగా మారింది. అప్పటి నుంచి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలంటూ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. దీంతో ఆదివారం సర్పంచ్ ఏదునూరి రవీందర్ సొంత నిధులతో రోడ్డు కొట్టుకుపోయిన చోట మొరం పోయించి మరమ్మతు చేయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయించి రోడ్డు బాగుచేయించాలని కోరారు.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని లింగంపల్లికి చెందిన కస్తూరి శంకరయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ఆదివారం ప్రజాప్రతినిధులు, నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఉప సర్పంచ్ కంకటి రాజన్న, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రవీందర్, వెంకటేశ్వర్లు, వెంకన్న, చంద్రమౌళి, రాజు, కుమార్, సత్తయ్య, రవీందర్‌చారి, రజనీకాంత్ ఉన్నారు.

అన్నదానం




పాలకుర్తి టౌన్: మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు చారగొండ్ల రవికుమార్ తండ్రి భిక్షపతి వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం మా ఇల్లు అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదానం చేశారు. మాజీ ఉపసర్పంచ్ కాటబత్తిని రమేష్, అనాథాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎన్నిక



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా గట్టు ఉప్పలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డివిజన్ కేంద్రంలో గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా గట్టు ఉప్పలయ్య, ఉపాధ్యక్షుడిగా పులి శ్రీనివాస్, కోశాధికారిగా గట్టు బంగ్లా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. సంఘం కమిటీ సభ్యులు ఇల్లందుల శ్రీనివాస్, గట్టు చిన్నరాజు, గట్టు శ్రీనివాస్, గట్టు ఎల్లయ్య, గట్టు కృష్ణ, పొన్నం ఎల్లయ్య, మోడెం శ్రీను పాల్గొన్నారు.

నియామకం



తరిగొప్పుల: జిల్లా మున్నూరు కాపు యువత జిల్లా అధ్యక్షుడిగా బొంతగట్టు నాగారం గ్రామానికి చెందిన నాం శ్రీనివాస్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ శనివారం ప్రకటించారు. ఈ మేరకు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేటి మణికంఠ నియామకపత్రాన్ని నాం శ్రీనివాస్‌కు ఆదివారం అందజేశారు. కుల ఐక్యతకు అహర్నిశలు కృషిచేస్తానని అన్నారు.

యువత అప్రమత్తంగా ఉండాలి

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతి, యువకులు చెడు మార్గాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సీఐ సత్యనారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని మడిపెల్లి గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ.. యువకులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, దొంగతనాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు.

బీఎల్‌ఓలకు కిట్ల పంపిణీ


బీఎల్‌ఓలకు కిట్లు అందజేస్తున్న తహసీల్దార్ విశాలాక్షి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల బీఎల్‌ఓలకు ఆదివారం మండల కేంద్రంలో సర్వే కిట్లను తహసీల్దార్ విశాలాక్షి పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కిట్లలో పెన్సిల్, పెన్ను, రబ్బరు, చాక్మార్, మార్కర్, ఒక పుస్తకం బ్యాగ్‌లో పెట్టి ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతీ బీఎల్‌ఓకు ఈ కిట్టును అందించనున్నట్లు తెలిపారు. ఎంఆర్ఐ భగత్‌రెడ్డి, ఏఆర్ఐ ఆంద్రయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, బీఎల్‌ఓలు కవిత, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి


నర్మెట: ఫాం-6 ను స్వీకరిస్తున్న తహసీల్దార్

నర్మెట: 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు తప్పని సరిగా ఓటు హక్కును కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం. వెంకన్న అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆదివారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. నూతన ఓటరు నమోదు తోపాటు పేరు, చిరునామా తదితర మార్పులు చేర్పులకు స్పెషల్ డ్రైవ్‌లో అవకాశమున్నందున ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సెప్టెంబర్ 2, 3 తేదీలలో బీఎల్‌ఓలు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఆర్ఐ సాయిబాబు, బీఎల్‌ఓలు వెంకట్ రెడ్డి, స్వేత, చంద్రకళ, శ్యామల పాల్గొన్నారు.


దేవరుప్పుల: రికార్డులను పరిశీలిస్తున్న హుస్సేన్

ఓటు హక్కు.. జన్మహక్కు

దేవరుప్పుల: ఓటు హక్కు జన్మహక్కుగా భావించాలని తహసీల్దార్ హుస్సేన్ సూచించారు. ఆదివారం మండలంలోని సింగరాజుపల్లిలో ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకునేలా అనుబంధ శాఖల యంత్రాంగం తోడ్పాటు అందించాలన్నారు. యువత సైతం తమ మొబైల్‌లో యాప్‌డౌన్ చేసుకొని ఉచితంగా ఓటు హక్కు పొందే వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 2,3 తేదీల్లో ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓలు అత్యధిక ఓటరు నమోదు చేసి ఆదర్శంగా నిలువాలని సూచించారు. ఆర్ఐ రాజు, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


బచ్చన్నపేట: పూజ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి


బచ్చన్నపేట: గడప వద్ద పూజలో గ్రామస్తులు


లింగాలఘణపురం: బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ స్వయంభూ శ్రీ సిద్దేశ్వరాలయంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజ నిర్వహించారు. అనంతరం శాలువాలతో సన్మానం చేశారు. పూజలో సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి ఆలయ సిబ్బంది చల్ల రాజేందర్‌రెడ్డి, మధు, లక్ష్మీకాంత్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయంలో గడప పూజ

మండలంలోని బండనాగారంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గామాత ఆలయంలో గడపను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ శివరాత్రి రాజనర్సు తెలిపారు. ఆదివారం గ్రామంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి పూజ చేశారు. మహిళలు మంగళహారతులతో వెళ్లి కొబ్బరి కాయలను కొట్టి గడపకు మొక్కుకున్నారు. గడప దాత గౌరారం కనుకయ్య, నాయకులు చల్ల సురేందర్‌రెడ్డి, రాపెల్లి జనార్దన్, , ఆంజనేయులు, బాలమల్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీరప్పకు పసరుపిల్ల ఉత్సవం

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని కురుమ సామాజిక వర్గానికి చెందిన వారి కులదైవమైన బీరప్పకు శ్రావణ ఆదివారం పసరుపిల్ల ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సామాజిక వర్గానికి చెందిన కులపెద్ద మనిషి కేమిడి శ్రీశైలం ఇంటి నుంచి నైవేద్యంగా బోనం చేసి సమర్పించిన అనంతరం యాటను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కులపెద్దలు సత్యనారాయణ, యాదగిరి, వీరసాయిమల్లేశం, గట్టయ్య, ఎంపీటీసీ భిక్షపతి, ఉపసర్పంచ్ కేమిడి కవితవెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం, వార్డు సభ్యులు శ్రీనివాసు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


దేవరుప్పల: బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

పల్లెల్లో ఘనంగా బోనాల పండుగ

దేవరుప్పుల: శ్రావణ మాసం పురస్కరించుకొని పల్లెల్లో ఆయా సామాజిక వర్గాల కులదేవతలకొలిచే తరుణంలో తొలుత వచ్చే మహిళలకు అత్యంత ప్రీతికరమైన బోనాల పండుగ ఆదివారం మండల కేంద్రంతోపాటు కామరెడ్డిగూడెం, సీతారాంపురం తదితర గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. వడ్రంగి, కమ్మరి, పద్మశాలీలు ఉదయం ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోగా మిగితా వర్గాలు సాయంత్రం శివసత్తులు పూనకాల మధ్య నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.


చిల్పూరు: ఆలయానికి వెళ్తున్న మహిళలు

చిల్పూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పోచమ్మ బోనాలను చేశారు. ఉదయం నుంచే మహిళలు పోచమ్మ ఆలయానికి బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించారు. చిన్నపెండ్యాలలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు లింగారెడ్డి

జనగామ రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకుడు టి.లింగారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేసి యూపీఎస్‌ను అమలు చేయాలని, అనేక పోరాటాలు చేసిన ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే పీఆర్సీ ప్రకటించి అమలు చేయాలన్నారు. సోమశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, డి.శ్రీనివాస్, భోగేశ్వర్, లక్ష్మయ్య, దివాకర్, రవి, చంద్రశేకర్, రాజు, యాదయ్య, అశోక్ , అంకుశావలి ఉన్నారు.

సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో ప్రవేశానికి నేడు స్పాట్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలల్లో ఇంటర్ మీడియట్ ఆంగ్లమాధ్యమం మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం నేడు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.రజిని, ఘన్‌పూర్ కళాశాల ప్రిన్సిపాల్ కాళహస్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, పాలకుర్తి, జఫర్‌గడ్, నర్మెట్ట(పెంబర్తి)లోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలలో ఇంటర్ మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2023 మార్చిలో పదవతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 28న జనగామ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉదయం 11 గంటలకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలన్నారు. విద్యార్హత సర్టిఫికెట్ల ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని వారు సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న సర్పంచ్

చిల్పూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని సర్పంచ్ లొడెం రజితరవీందర్ పిలుపునిచ్చారు. మండలంలోని కొండాపూర్‌లో ఆదివారం కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి కల్లూరి రాజు, ఉప సర్పంచ్ కొడ సంపత్, గ్రామ శాఖ అధ్యక్షుడు గాలి ప్రవీణ్, లొడెం రవీందర్, కొండ తిరుపతి, గూళ్ల ప్రకాష్, డీలరు మల్లేషం, కొండ రమేష్, పోతన రాజబాబు ఉన్నారు.

సోమయ్య మృతి పార్టీకి తీరని లోటు


ఆర్థికసాయం అందజేస్తున్న సురేష్‌నాయక్

కొడకండ్ల: రామన్నగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బాకి సోమయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. ఆదివారం సోమయ్య కుటుంబసభ్యులను కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పరామర్శించి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పంపిన ఆర్థికసాయం అందజేశారు. నాయకులు రవీందర్, ఖలీం, శ్రీను, సోమన్న, మల్లేష్, అంజయ్య తదితరులు ఉన్నారు.

1నుంచి వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ విమర్శించారు. ఈక్రమంలో సెప్టెంబర్ 1నుంచి కాంట్రాక్టు అధ్యాపకులు సమ్మె చేపట్టబోతున్నట్లు హెచ్చరించారు. ఆదివారం నిర్వహించిన గూగుల్ మీట్ ఆన్‌లైన్ సమావేశంలో జేఏసీ కాంట్రాక్టు అధ్యాపకులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న 1,445మంది కాంట్రాక్టు అధ్యాపకులందరినీ క్రమబద్ధీకరించాలని సూచించారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ వర్కింగ్ చైర్మన్ డాక్టర్ రామేశ్వర్‌రావు, బాధ్యులు పల్లా రేష్మా రెడ్డి, రాజేష్ కన్నా, దశరథం పాల్గొన్నారు.

ఆత్మీయ సభకు తరలిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

జనగామ రూరల్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని కోరుతు వరంగల్‌లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చేపట్టిన ఉద్యోగుల ఆత్మీయ సభకు ఆదివారం జిల్లా నాయకులు తరలివెళ్లారు. ఉద్యమ సమయంలో ఉద్యోగులను పర్మనెంట్ చేస్తామని చెప్పి నేటికీ సీఎం కేసీఆర్ అమలు చేయలేదని జిల్లా యూనియన్ అధ్యక్షుడు రాజేష్ అన్నారు. తక్షణం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనకరాజు, అన్నం సత్యపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే రెడ్ల సమస్యల పరిష్కారం

తొర్రూరు: ఐక్యతతోనే రెడ్డి సామాజికవర్గ సమస్యలు పరిష్కారమవుతాయని రెడ్డి సంక్షేమ పరివార్ సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం రెడ్డి సంక్షేమ పరివార్ అర్థ వార్షికోత్సవంలో భాగంగా పేద రైతులకు రూ.1.50లక్షల విలువ చేసే టార్పాలిన్లు ఉచితంగా అందజేశారు. సంఘ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద రెడ్ల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ఎస్‌పీటీ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, వ్యవసాయ సామగ్రి, అవసరార్థులకు ఆర్థిక చేయూతనందిస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ముద్దం విక్రమ్‌రెడ్డి, కోశాధికారి కొండ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు కందాడి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 4న దళిత ఉపకులాల ఆత్మగౌరవ సభ

హన్మకొండ చౌరస్తా: దళితుల్లో వెనుకబడిన 57 ఉపకులాల సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 4వ తేదీన హైదరాబాద్‌లో లక్ష మందితో నిర్వహించనున్న ఆత్మగౌరవ సభకు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి బైరి వెంకటేశం మోచి పిలుపునిచ్చారు. హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్‌లో సమితి రాష్ట్ర స్థాయి సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో టీఎస్ స్వామి, మిత అయ్యాల్వర్, రాయిల లక్ష్మి, నర్సయ్య, వెంకటేష్, హోలియా దాసరి, తుల సీదాస్, రామారావు, ధర్మయ్య హాజరయ్యారు.

అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి కృషి


సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

తొర్రూరు: అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి అందరూ కృషి చేయాలని జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలో అంబేడ్కర్ భావజాలంపై మండల స్థాయి సదస్సు నిర్వహించారు. అంతకుముందు నీలి జెండాలతో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు రాయిశెట్టి యాకేందర్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో శ్రీనివాస్, రామచంద్రయ్య మాట్లాడారు. దేశ గమనాన్ని మార్చడంలో అంబేడ్కర్ పోషించిన పాత్ర ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు కామ సంజీవరావు, నాయకులు సామేలు, వెంకన్న, కృష్ణమూర్తి, నారాయణ, మహేష్, ఐలయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

రేపు ఆయిల్‌పామ్ పరిశ్రమకు శంకుస్థాపన



తొర్రూరు: మండలంలోని గోపాలగిరిలో ఈ నెల 29న ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు తెలిపారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. 45 ఎకరాల్లో రూ.175 కోట్లతో నిర్మించనున్న ఆయిల్‌ఫామ్ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డిలు హాజరుకానున్నారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.